సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 5 । జూలై । 2025



సెల్ఫీ కొట్టు..ప్రైజ్ పట్టు
దేశవ్యాప్తంగా విద్యార్థులకు హరిత్–ద వే ఆఫ్ లైఫ్ అనే థీమ్‌తో పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. 8లో▸



వంతెన కష్టాలు..! 9లో▸
ఆ గ్రామాలకు వెళ్లాలంటే కనీసం రోడ్డు సౌకర్యం కూడా ఉండదు. కాలినడకన వాగులు, వంకలు దాటుకుంటూ వెళ్లక తప్పదు. వంతెనలు లేక వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వైద్యుడితో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని నక్షత్ర ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు, చార్జెస్ బోర్డు, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్, డయాగ్నొస్టిక్ సర్వీసుల ప్రమాణాలు, ఆరోగ్యశ్రీ సేవల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో కార్డియాక్ట్ కన్సల్టెంట్ పేరును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడంతో యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ప్రదర్శించిన ధరకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన ఫార్మాసిస్టులు పనిచేయాలని ఆదేశించారు. పరిశీలనలో వచ్చిన లోపాలు తక్షణమే సవరించుకోవాలన్నారు. కలెక్టర్‌వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఎన్‌సీడీ అధికారి శ్రీధర్ తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ
ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, కళాశాల, అనుకుంటలోని మహాత్మా జ్యోతి బాపూలే, మైనార్టీ గురుకుల పాఠశాలలను కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జ్యోతి బాపూలే రెసిడెన్షియల్‌లో డ్రెయినేజీ, రోడ్డు వసతి, వీధి దీపాలు లేకపోవడంతో అధికారులతో చర్చించి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఉన్నారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య
కైలాస్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, కుర్మ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతాంగ హక్కుల కోసం నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కే.రాజలింగు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి
కైలాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత కె.రోశయ్య జయంతి వేడుకలను శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుని కొనియాడారు. ఇందులో ఆర్డీవో వినోద్ కుమార్, కలెక్టరేట్ ఏవో వర్మ, తహసీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత
ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును ఐసీడీఎస్ పీడీ మిల్కాకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ శుక్రవారం అందజేశారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఎరువుల స్టాకుపై ఆందోళన వద్దు
బేల: జిల్లాలో డీఏపీ, యూరియా స్టాకు సరిపడా ఉందని, రైతుల్లో ఆందోళన వద్దని ఏడీఏ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. స్టాకు బోర్డుతో పాటు నిల్వలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ కొరత సృష్టించొద్దని డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఏవో సాయితేజరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులున్నారు.

అరకొర వైద్యమే..



ఉదయం 11 గంటల సమయంలో రిమ్స్‌లోని స్పీచ్ థెరపీ విభాగం గది తెరుస్తున్న సిబ్బంది

- సమయపాలన అంతంతే..
- సర్కారు ఆసుపత్రుల్లో వెక్కిరిస్తున్న ఖాళీలు
- సరిపడా వైద్యులు, సిబ్బంది కరువు
- ఏ వైద్యానికైనా రిమ్స్‌కే రెఫర్
- పెద్దాసుపత్రిలోనూ సమస్యలే!
- ఇబ్బందుల్లో రోగులు
- 'సాక్షి విజిట్'లో వెల్లడి



రిమ్స్ ఓపీ వద్ద బారులుతీరిన రోగులు

ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ: జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సబ్‌సెంటర్లలో పూర్తిస్థాయి వైద్యం అందడం లేదు. చాలాచోట్ల వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి. 24 గంటల పాటు పనిచేసే పీహెచ్‌సీల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరే ఉన్నచోట వారు గ్రామాలకు వెళ్లి వైద్యం అందించే క్రమంలో ఆస్పత్రుల్లో రోగులకు వైద్యం అందని దుస్థితి. ఉట్నూర్‌లోని జిల్లా ఆస్పత్రి పరిస్థితి మరింత దారుణం. పూర్తిస్థాయి పోస్టులు భర్తీ కాకపోవడంతో గిరిజనులకు వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. ఏ వైద్యానికైనా అక్కడి వైద్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కే రెఫర్ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయంలో పెద్దాసుపత్రికి తరలించే లోపే క్షతగాత్రుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వర్షాకాలం కావడంతో పలు పీహెచ్‌సీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపించింది. పలువురు వైద్యులు పీహెచ్‌సీకి చేరుకున్నప్పటికీ పలుచోట్ల సమయపాలన పాటించడం లేదు. వారి కోసం రోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి. శుక్రవారం 'సాక్షి' జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, రిమ్స్‌ను తనిఖీ చేయగా, పలు విషయాలు బయటపడ్డాయి.

148 పోస్టులు ఖాళీ..
వైద్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రులకు సంబంధించి వైద్యులు, ఇతర సిబ్బంది కలిపి 463 పోస్టులకు గాను ప్రస్తుతం 315 మంది పనిచేస్తున్నారు. 148 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆదిలాబాద్ పట్టణంలో ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, చిల్కూరిలక్ష్మీనగర్‌లో మాత్రమే వైద్యుడు పనిచేస్తుండగా, పుత్లీబౌళి, హమాలీవాడ, శాంతినగర్, ఖుర్షీద్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటేషన్‌పై ఇక్కడ వైద్యులు పనిచేస్తున్నారు. దీంతో సంబంధిత పీహెచ్‌సీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు మూడు, యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు నాలుగు, స్టాఫ్‌నర్సులు మూడు, ఏఎన్‌ఎంలు 43, ల్యాబ్ టెక్నీషియన్లు ఐదు, ఫార్మాసిస్టులు 10, ఎంపీహెచ్‌డబ్ల్యూ మేల్ 63 పోస్టులు ఖాళీగాఉన్నాయి. వీరితోపాటు వాచ్‌మెన్, అటెండర్లు, ల్యాబ్ అటెండెంట్లు, హెల్పర్లు, స్వీపర్లు, ఇతర సిబ్బంది పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

విజిట్‌తో వెలుగులోకి..



జిల్లా కేంద్రంలోని శాంతినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

- జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఓపీ విభాగం రోగులతో కిక్కిరిసి కనిపించింది. ఉదయం 10 గంటలకే భారీగా చేరుకున్నారు. చాలా మంది జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాల సమస్యలతో వచ్చిన వారు ఎక్కువగా ఉన్నారు. చిల్డ్రన్ వార్డులో 70 బెడ్లకు గాను 32 మంది చిన్నారులు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. దాదాపు అన్ని ఓపీ వార్డుల్లో వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్లు, మెడికోలు రోగులకు వైద్య పరీక్షలు చేస్తూ కనిపించారు. పాథాలజీకి సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్లు ఓ గదిలో కూర్చొని ఉండగా, ట్రెయినీ విద్యార్థులు రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. పలువార్డులు పరిశుభ్రంగా ఉండగా, రోగుల బంధువులు పైఅంతస్తు నుంచి చెత్తాచెదారం వేయడంతో అక్కడక్కడా అపరిశుభ్రత దర్శనమిచ్చింది.
- శాంతినగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించగా డాక్టర్, ఇతర సిబ్బంది అందుబాటులో లేరు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది మందులు పంపిణీ చేస్తూ కనిపించారు.
- భోరజ్ మండలంలోని గిమ్మ ఆస్పత్రిని ఉదయం విజిట్ చేయగా, వైద్యులు రోగులకు సేవలు అందిస్తూ కనిపించారు. ఇక్కడ ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు.
- ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీని పరిశీలించగా.. వైద్యుడు రోగులకు వైద్యసేవలు అందిస్తూ కనిపించాడు. అనంతరం ఆయుష్ ఆస్పత్రిని విజిట్ చేయగా అక్కడ వైద్యులు అందుబాటులో లేరు.
- బేల మండల కేంద్రంలో పీహెచ్‌సీని విజిట్ చేయగా.. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి సామగ్రిని తరలిస్తూ కనిపించారు.
- ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి రెండు నెలల నుంచి మూతబడి ఉంది. ఇక్కడ పనిచేసే ఆఫీస్ సబార్డినేట్ మృతి చెందినప్పటి నుంచి సంబంధిత వైద్యులు రావడం లేదని రోగులు చెబుతున్నారు. మందుల కోసం రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నార్నూర్: మండలకేంద్రంలోని సీహెచ్‌సీలో పది మంది లోపు రోగులు కనిపించారు. స్పెషలిస్ట్ వైద్యపోస్టులు ఆరు మంజూరు ఉండగా ప్రస్తుతం దంత వైద్యుడు జితేందర్‌రెడ్డి డీడీవో బాధ్యతలు నిర్వహిస్తూనే సేవలందిస్తున్నారు. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు రాజమణిని ఇక్కడ తాత్కాలికంగా నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో దుప్పట్ల కొరత ఉంది.

ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో..



రోగులతో కిటకిటలాడుతున్న జనరల్ వార్డు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రికి శుక్రవారం 250 మంది వరకు ఓపీ వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. జనరల్, ఫీవర్‌వార్డులు రోగులతో నిండిపోయాయి. డాక్టర్ల కొరతతో పాటు ప్రత్యేక వైద్యనిపుణులు లేక సకాలంలో వైద్యం అందని పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎక్కువగా రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. అలాగే స్టాఫ్‌నర్సుల కొరత కూడా ఉందని, మరమ్మతుకు నోచుకోక జనరేటర్ మూలన పడిందని తెలిపారు.


- నేరడిగొండ పీహెచ్‌సీ 24 గంటల ఆస్పత్రి కాగా, ఒక్కరే వైద్యులు ఉన్నారు. ఒకరు రిమ్స్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. రోజుకు 120 వరకు ఓపీ ఉంది. గ్రామాల్లో వైద్యుడు సందర్శించిన సమయంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.
- బోథ్ సీహెచ్‌సీ ఆస్పత్రిని పరిశీలించగా.. రోగులు అంతంత మాత్రంగా వచ్చారు. ఆరుగురు వైద్యులకు గాను ఇద్దరే విధుల్లో ఉన్నారు. రోగులు ఇబ్బంది పడుతూ కనిపించారు.
- తలమడుగు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు గాను ఒక్కరు మాత్రమే పనిచేస్తుండగా, ఒకరు డిప్యూటేషన్‌పై ఉన్నారు.
- గుడిహత్నూర్ పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యుడు ఒక్కడే ఉన్నారు. ఓపీ కోసం రోజుకు వంద మంది వరకు రోగులు వస్తున్నారు. ఫార్మాసిస్టు, ఏఎన్‌ఎం, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- తాంసి పీహెచ్‌సీలో ఓపీ ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందిస్తూ కనిపించారు.
- ఇచ్చోడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి చెందిన ఒకే డాక్టర్ రెండుచోట్ల సేవలు అందిస్తున్నారు. ఇచ్చోడ ఆయుష్మాన్ డాక్టర్ శ్రీకాంత్‌కు తలమడుగుకు డిప్యూటేషన్ ఇవ్వడంతో మూడు రోజులు ఇచ్చోడలో, మూడు రోజులు తలమడుగులో సేవలు అందిస్తున్నారు. దీంతో రెండు మండలాలకు సైతం పూర్తిస్థాయిలో సేవలు అందని పరిస్థితి.
- బజార్‌హత్నూర్‌లో 24 గంటల వైద్యసేవలు అందించే దవాఖానా ఉంది. నలుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ముగ్గురే ఉన్నారు.



ఇంద్రవెల్లి : దస్నాపూర్‌లో తెరుచుకోని ఆయుర్వేద ఆస్పత్రి

వీడని అసంతృప్తి!

- మంత్రివర్గంలో చోటు దక్కక నిరాశలో పీఎస్సార్
- అగ్రనేతలను కలుస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే
- తనకు అన్యాయం జరిగిందంటూ వేడుకోలు



ప్రేమ్‌సాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంత్రి పదవి ఆశించి భంగపడిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) అసంతృప్తి వీడడం లేదు. రెండో విడతలో తనకు కేబినెట్ బెర్త్ ఖాయమని భావించినా పక్కన పెట్టడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయన అనుచర వర్గానికి ఊహించని విధంగా షాక్ తగిలింది. మరోవైపు జిల్లా నుంచే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రిగా అవకాశం కల్పించి తనకు ఇవ్వకపోవడంపై కొద్ది రోజులుగా అసంతృప్తితోనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు గత పదేళ్లగా ఉమ్మడి జిల్లాలో బలోపేతానికి కృషి చేశానని, తనకు అవకాశం కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇంద్రవెల్లి సభ నుంచి అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రతోపాటు మంచిర్యాలలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే బహిరంగ సభ వరకు ఎన్నో పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేశారు. ఎన్నికల ముందు ఏఐసీసీ అధ్యక్షుడితో సహా పలువురు అగ్రనేతలు పీఎస్సార్‌కు సముచిత స్థానం ఉంటుందని హామీలు ఇచ్చారు. తీరా ఆయనకు అవకాశం రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇటీవల గాంధీభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నారు. తనకు అవకాశం కల్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎటువైపో..!

గత ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' బహిరంగ సభలో తనగొంతు నొక్కొద్దంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ముందే ఆవేదనతో మాట్లాడారు. నిన్న మొన్న వచ్చిన వాళ్లకు అవకాశం ఇచ్చి తనను విస్మరిస్తున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాకు పదవుల్లో అన్యాయం చేస్తే ఏం చేయడానికైనా సిద్ధమేనంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో తన అసంతృప్తి ఎటువైపు దారి తీస్తుందోనని రాజకీయంగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచీ విధేయతగా ఉంటున్నారు. అయినా కేబినెట్‌లో చోటు దక్కకపోవడంపై తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో మంత్రివర్గంలో చోటు కాకుండా ఇతర ఏ పదవీ ఇచ్చినా తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. ఎమ్మెల్యేగానే నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకునే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో అధిష్టానం ఆయనకు అవకాశం ఇస్తుందా..? లేదా..? పీఎస్సార్ వెనక్కి తగ్గి ఉంటారా..? అనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

పంటల రుణపరిమితి పెంపు

- పత్తి, మొక్కజొన్నకు రూ.2 వేలు అదనం
- బ్యాంకర్లు ఆదరించేనా..
- రైతులకు ఆసరా లభించేనా..?

సాక్షి,ఆదిలాబాద్: ఈ ఏడాది పంట రుణ పరిమితిని ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ) సిఫార్సుల మేరకు ఈ పెంపు ఉంటుంది. ప్రధానంగా రైతులకు ఏటా సాగులో పెట్టుబడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రుణ పరిమితి పెంపు ద్వారా అన్నదాతకు బ్యాంకులో లభించే రుణం కూడా పెరగనుంది. జిల్లాలో ఈ ఏడాది 5లక్షల 85వేల 350 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా పత్తి 4లక్షల 40వేల ఎకరాల్లో సాగు కానున్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత సోయా 62,500 ఎకరాలు, కందులు 55వేల ఎకరాలు, జొన్న 23వేల ఎకరాలు, తర్వాత వరి, మినుము, పెసర, ఇతర పంటలు స్వల్పంగా సాగు కానున్నట్లు పేర్కొంది.

పత్తి రైతుకు మేలు..

జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పత్తికి సంబంధించి పంట రుణ పరిమితి పెంచడం ద్వారా రైతులకు మేలు చేకూరనుంది. ఎకరానికి నిర్ధారిత మొత్తం బ్యాంకర్లు రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా సాగులో వారికి పెట్టుబడి భారం ఉపయుక్తంగా ఉంటుంది.

బ్యాంకులు ఆదరించేనా..

ఈఏడాది 2లక్షల 9వేల 229 మంది రైతుల అకౌంట్లకు రుణాలు అందజేయాలని బ్యాంకర్లు లక్ష్యం పెట్టుకున్నారు. అలాగే అన్నదాతలకు విరివిగా రుణాలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతుల ఆర్థిక పరిస్థితులతో రుణం కట్టలేని పరిస్థితిలో ఉండగా, బ్యాంకర్లు దాన్ని మరోవిధంగా తమకు ఉపయుక్తంగా మార్చుకుంటున్నారు. పాత రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నట్టే చేసే బ్యాంకర్లు రుణపరిమితి ఆధారంగా పెంచిన మొత్తాన్ని రైతుల చేతికి ఇచ్చి మిగతా మొత్తం పాత బకాయిగా సర్దుబాటు చేసుకోవడం ద్వారా తమ లక్ష్యం పూర్తయిందన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. సాధారణంగా ఏటా బ్యాంకులో రైతుల పరంగా జరిగే ఈ తంతు సాధారణమే. ఈ పరిస్థితుల్లోనే రైతులు తిరిగి బయట అప్పు చేస్తుండడం ఆనవాయితీగా మారింది.

పంటల వారీగా రుణ పరిమితి.. (యూఐ- అన్ ఇరిగేటెడ్)

పంట	ప్రస్తుత రుణ పరిమితి ఎకరానికి (రూ.లలో)	పెంచిన రుణ పరిమితి ఎకరానికి(రూ.లలో)
పత్తి (యూఐ)	44,000-46,000	46,000-48,000
సోయా	28,000-30,000	28,000-30,000
మినుము (ఇరిగేషన్)	19,000-21,000	20,000-22,000
మినుము (యూఐ)	15,000-17,000	16,000-18,000
పెసర్లు (ఇరిగేషన్)	20,000-22,000	20,000-22,000
పెసర్లు (యూఐ)	16,000-18,000	17,000-19,000
శనగ	24,000-26,000	25,000-27,000
జొన్న (ఇరిగేషన్)	18,000-20,000	19,000-21,000
జొన్న (యూఐ)	17,000-19,000	17,000-19,000
వరి (ఇరిగేషన్)	43,000-45,000	44,000-46,000
మొక్కజొన్న (ఇరిగేషన్)	32,000-34,000	34,000-36,000
మొక్కజొన్న (యూఐ)	26,000-28,000	28,000-30,000
గోధుమ (ఇరిగేషన్)	19,000-21,000	19,000-21,000
కందులు (ఇరిగేషన్)	22,000-24,000	23,000-25,000
కందులు (యూఐ)	19,000-21,000	20,000-22,000



విత్తనాలు వేస్తున్న కూలీలు (ఫైల్)

విరివిగా పంట రుణాలందించాలి..

బ్యాంకర్లు రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలి. పెంచిన రుణ పరిమితి ఆధారంగా పంపిణీ చేయాలి. లక్ష్యం మేరకు బ్యాంకర్లు ముందుకు సాగాలి.
– ఉత్పల్, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఆదిలాబాద్

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కైలాస్‌నగర్: రైతులకు సాగునీటిని అందించేలా ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ నియోజకవర్గంలోని సాగునీటి పరమైన అంశాలపై జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పిప్పల్‌కోటి, దేగామ రిజర్వాయర్ల భూ నిర్వాసితుల సమస్యలపై ఆరా తీశారు. తేజాపూర్, బుగ్గారం, పిప్రి, లిఫ్ట్‌ఇరిగేషన్ల పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడెగామ, కజ్జర్ల, మత్తడివాగు, చింతలబోరి, సీతాగొంది కెనాల్స్ మరమ్మతులు, మత్తడివాగు బ్రిడ్జిల నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో కొనసాగుతున్న 11 చెక్‌డ్యాంల పనుల పురోగతి వివరాలు తెలుసుకున్నారు. బోథ్ నియోజకవర్గంలో చేపట్టిన పనులన్నింటిని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అలాగే నియోజకవర్గ పరిధిలో కొత్తగా 11చెరువుల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలన్నారు. ఇందులో ఇరిగేషన్‌శాఖ అధికారులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆర్డీవో వినోద్‌కుమార్ బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ ఆకస్మిక బదిలీ అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గతేడాది మార్చిలో బాధ్యతలు చేపట్టిన ఆయన ఎన్నికల నిర్వహణతో పాటు ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల విజయవంతంలోనూ కీలకపాత్ర పోషించారు. జిల్లా ఉన్నతాధికారులకు పాలనాపరంగా అండగా నిలుస్తూ వస్తున్నారు. అయితే తాజాగా సదరు అధికారిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని(పీఆర్‌ఆర్‌డీ) విభాగానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిగా పనిచేస్తున్న బి.స్రవంతిని ఆర్డీవోగా నియమించారు. అయితే ఈ ఉత్తర్వులు అందుకున్న ఆమె గంటల వ్యవధిలోనే విధుల్లో చేరేందుకు ఆదిలాబాద్ చేరుకున్నారు. తొలుత అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసేందుకు యత్నించగా ఆమె బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసేందుకు క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆమె రాత్రి వరకు అక్కడ వేచిచూసినట్లుగా తెలుస్తోంది. కలెక్టర్ వివిధ సమీక్షలతో బిజీగా ఉండటంతో కలిసేందుకు వీలు పడనట్లుగా సమాచారం. ఇది వరకు జిల్లాలో ఆర్డీవో బాధ్యతలు నిర్వర్తించిన ఆమె తిరిగి ఆర్డీవోగా కొనసాగుతారా లేదా అనే దానిపై ఆసక్తికర చర్చ సాగుతోంది.

క్లుప్తంగా

నకిలీ పోలీస్ అరెస్ట్


పోలీసుల అదుపులో కుడ్మెత నాగరావ్

గుడిహత్నూర్: పోలీస్ అవతారమెత్తి ప్రజలను మోసగిస్తూ, డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ పోలీస్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు, పీఎస్సై మధుకృష్ణ తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా వ్యక్తి కనిపించాడు. సదరు వ్యక్తిని విచారించగా నార్నూర్‌కు చెందిన కుడ్మెత నాగరావ్ అని గుర్తించి సెల్‌ఫోన్‌ను పరిశీలించారు. పోలీసు యూనిఫాంతో ఉన్న అతడి ఫొటోలు ఉన్నాయి. వాట్సాప్ డీపీలో యూనిఫాం వేసుకున్న ఫొటో పెట్టాడు. వీటిని చూపిస్తూ ప్రజల వద్ద డబ్బులు వసూళ్లు చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి పోలీస్ అని రాసి ఉన్న బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ చేసిన బంగారు గొలుసు విక్రయిస్తూ..


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్‌టౌన్: చోరీ చేసిన బంగారు గొలుసు విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. గతనెల 30న నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కడెంకు చెందిన కిష్టమ్మ మెడలో రెండు తులాల బంగారుగొలుసు చోరీకి గురైంది. పోలీసులు బస్టాండ్ వద్ద గల సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగలు ఆదిలాబాద్‌కు చెందిన సంగింటి లక్ష్మి, నిర్మల్‌కు చెందిన పండెన కవిత గుర్తించారు. చోరీ చేసిన బంగారాన్ని విక్రయించేందుకు ఇద్దరు మహిళలు వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసు, కత్తెరను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సంజీవ్, జిల్లా సీసీఎస్ టీమ్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

కేజ్‌వీల్స్ చోరీ కేసులో ఇద్దరు..

దండేపల్లి: కేజ్‌వీల్స్ చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొత్తమామిడిపల్లి గ్రామానికి చెందిన బతుల నరేశ్ ట్రాక్టర్‌కు అమర్చే కేజ్‌వీల్స్‌ను మాదాపూర్‌కు చెందిన పిట్టల సాయిరాం, బాలసాని సత్తయ్య ఈనెల 2న రాత్రి సమయంలో వాహనంలో పట్టుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేపట్టారు. సాయిరాం, సత్తయ్యను పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. రూ.80 వేల విలువ గల కేజ్‌వీల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సెల్ఫీ కొట్టు..ప్రైజ్ పట్టు


జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతూ సెల్ఫీ దిగుతున్న విద్యార్థిని



పర్యావరణంపై పోటీలకు సంబంధించిన పోస్టర్

- పర్యావరణంపై ఏకోమిత్రం పోటీలు
- జూలై 21 వరకు పోటీల నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీ (ఎన్ఎస్‌పీసీ)ని నిర్వహిస్తోంది. హరిత్–ద వే ఆఫ్ లైఫ్ అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1న ప్రారంభమైన పోటీలు 21 వరకు కొనసాగనున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, వ్యర్థాలు వేరు చేయడం, వాతావరణంలో పొంచి ఉన్న ప్రమాదాలను లోతుగా అర్థం చేసుకునేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు దీని ప్రధాన ఉద్దేశం. జిల్లాలో అన్ని పాఠశాలల యాజమాన్యాలు గత నాలుగు రోజులుగా విద్యార్థులు ప్రధానంగా మొక్కలు నాటడం, వ్యర్థాలను వేరు చేయడం, నీటి సంరక్షణ అంశాలకు సంబంధించి స్వీయచిత్రాలు (సెల్ఫీ దిగి) యాప్‌లో ఉత్సాహంగా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరూ ఇ–సర్టిఫికెట్లు అందుకుంటున్నారు. జాతీయస్థాయిలో క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి నగదు పారితోషికంతోపాటు జాతీయ హరిత విద్యార్థి అవార్డు అర్హత పొందవచ్చు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రతీ పాఠశాల విద్యార్థులు పర్యావరణ ఏకోమిత్రం పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఈపోటీల్లో పాల్గొనేవారికి ఇ–సర్టిఫికెట్ల ఇవ్వడంతోపాటు విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలుగుతుంది.

– యాదయ్య, డీఈవో

ఒకటో తరగతి నుంచి..

ఈ పోటీల్లో ఒకటి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఏకో మిత్రం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్, ఇతర భాషల్లో క్విజ్ ఉంటుంది. మొక్క నాటుతున్న నీరు పాదుపు చేస్తున్న వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ లోడ్ చేయాల్సి ఉంటుంది. 1 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 8 వరకు, మూడో గ్రూప్‌లో 9 నుంచి 12వ తరగతి, నాలుగో గ్రూప్‌లో గ్రాడ్యుయేట్, పీజీ పరిశోధకులు, ఐదో గ్రూప్‌లో ఇతరులకు అవకాశం కల్పించారు. ఈనెల 21 వరకు పోటీలు నిర్వహిస్తారు. ఆగస్టు 30న ఫలితాలు వెల్లడించనున్నారు.

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్


ఏసీబీ దాడిలో పట్టుబడిన డిప్యూటీ తహసీల్దార్, తాత్కాలిక ఉద్యోగి

కోటపల్లి: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. భీమారం గ్రామానికి చెందిన గంట నరేశ్ నుంచి డబ్బులు డిమాండ్ చేసి పట్టుబడ్డారు. వివరాలిలా ఉన్నాయి. భీమారానికి చెందిన గంట నరేశ్ మండలంలోని రాజారం శివారులో సర్వే నంబరు 71/13/2లో 20గుంటల భూమిని తన తండ్రి లక్ష్మయ్య పేరిట పట్టా చేయించేందుకు ఈ కేవైసీ కోసం డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను సంప్రదించాడు. ఆయన రూ.15వేలు డిమాండ్ చేయగా.. అంత ఇచ్చే స్థోమత లేదని, రూ.10వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నవీన్‌కుమార్‌కు సమాచారం ఇవ్వగా.. తాత్కాలిక ఉద్యోగి అంజికి ఇవ్వాలని సూచించారు. కార్యాలయం వెనుకాల డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు సీజ్ చేసి కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి పలు ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అంజి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను ఏసీబీ డీఎస్పీ మధు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టుకు తరలిస్తామని పేర్కొన్నారు. 20గుంటల భూమి పట్టా చేసేందుకు డిప్యూటీ తహసీల్దార్ పది రోజులుగా వేధిస్తున్నారని, ప్రతీరోజు ఉదయం సాయంత్రం వరకు ఇక్కడే ఉండడం డ్యూటీగా మారిందని నరేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

వేధిస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు

- కలెక్టరేట్‌లోని ఓ ఉద్యోగిని విన్నపం
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఓ శాఖ ఉద్యోగుల మధ్య వివాదం నడుస్తోంది. భూగర్భ జల శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తనను తోటి సిబ్బంది వేధిస్తున్నారంటూ గత సోమవారం ప్రజావాణిలో నేరుగా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి విచారణ చేయాలంటూ మరో మహిళా జిల్లా ఉన్నతాధికారిని ఆదేశించారు. దీంతో సదరుమహిళా ఉద్యోగినితో పాటు కార్యాలయంలో ఇతర సిబ్బంది ని ప్రాథమికంగా విచారణ జరిపారు. ఉద్యోగుల నుంచి పలు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న మహిళా ఉద్యోగి తన తోటి ఉద్యోగులపైనే ఫిర్యాదు చేయడం కలెక్టరేట్ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు శాఖ పరమైన బిల్లుల ఫైళ్ల మాయంపై గతకొద్ది రోజులుగా సిబ్బంది మధ్య వివాదం ఉంది. ఆ శాఖలో పని చేసి బదిలీపై వెళ్లిన అధికారి ఉన్న సమయంలోని పలు బిల్లుల ఫైళ్లు కనిపించకపోవడం,వాటాపై ఆరా తీయడంతో ఉద్యోగుల మధ్య గొడవకు కారణమైనట్లుగా తెలుస్తోంది. మరోవైపు తనను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని మహిళా ఉద్యోగి ఫిర్యాదు నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

సెల్‌ఫోన్లు చోరీ చేసి..పాస్‌వర్డ్‌లు ఓపెన్ చేసి

- ఫోన్ పే, గూగుల్ పే నుంచి నగదు తస్కరణ
- పోలీసులకు పట్టుబడ్డ మైనర్ బాలుడు


వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ

సారంగపూర్: ప్రజల వద్ద నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేసి..పాస్‌వర్డ్‌లు ఓపెన్ చేసి గూగుల్ పే, ఫోన్ పే ద్వారా మైనర్ బాలుడు డబ్బులు తస్కరించిన ఘటన మండలంలో చేసుకుంది. స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై శ్రీకాంత్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. సారంగపూర్ మండలం ఆలూరుకు చెందిన దండు రవికిరణ్, నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌కు చెందిన రవికుమార్‌ల కిరాణా షాపునకు వెళ్లి వారం క్రితం ఓమైనర్ బాలుడు సరుకులు కొనుగోలు చేస్తున్నట్లు నటించి వారి సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. పాస్‌వర్డ్ తెరిచి ఫోన్‌పే యాప్ ద్వారా దండు రవికిరణ్ ఫోన్ నుంచి రూ.20 వేలు, రవికుమార్ ఖాతా నుంచి రూ.13 వేలను ఇతర ఖాతాలకు బదిలీ చేసి నగదుగా మార్చుకున్నాడు. ఈ విషయమై సదరు షాపు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్, రూరల్ సీఐ మున్నూరు కృష్ణలు సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ ప్రారంభించారు. సదరు మైనర్ బాలుడు తస్కరించిన ఫోన్లలో తన ఫొటోలు తీసుకున్నాడు. అయితే సదరు ఫొటోలు బాధితుల గూగుల్ ఫొటోల్లోకి అప్‌లోడ్ కావడంతో బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశారు. శుక్రవారం సారంగపూర్ పరిధిలో బాలుడిని అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు. అతన్ని వద్ద నుంచి రూ.38వేల నగదు, ఒక వీవో 5జీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన రూరల్ సీఐ, స్థానిక ఎస్సై, సిబ్బంది ఆకాశ్, వినోద్, ప్రణీత్‌లను ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా అభినందించారు.

కీచక టీచర్‌పై కేసు..

ఆదిలాబాద్‌టౌన్: ఇంద్రవెల్లి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కీచక ఉపాధ్యాయుడిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. తమపట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నారని విద్యార్థినులు షీటీమ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వారు శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులతోపాటు విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

దొంగ ఇంటినంబర్లు సృష్టించిన వారిపై..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి కేఆర్‌కే కాలనీలో దొంగ ఇంటినంబర్లు సృష్టించి ప్లాట్లు కబ్జా చేసిన మాజీ కౌన్సిలర్ కుమారుడు ఆనంద్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్‌కే కాలనీలో సర్వే నంబర్ 68లో జానకొండ పోసానికి సంబంధించిన స్థలానికి దొంగ ఇంటి నంబర్లు సృష్టించారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా ఆనంద్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు వారిని శుక్రవా రం అదుపులో తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై..

వేమనపల్లి: రెండు బైక్‌లపై గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. కుము రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం నుంచి బానోతు ఆనంద్, దరావత్ రాజు బైక్‌లపై గుడుంబాను వేమనపల్లి మండలం మంగెనపల్లి, రాజారాం, వేమనపల్లి గ్రామాలకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై.. మంగెనపల్లి సమీప అటవీప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఆ బైక్‌లను ఆపి తనిఖీ చేయగా గుడుంబా లభ్యమైంది. ఇద్దరి వద్ద నుంచి 100 లీటర్ల గుడుంబా ప్యాకెట్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట ఇద్దరిని బైండోవర్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తలపై..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి జిల్లాకేంద్రంలో విక్రయిస్తున్న భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్ కలీమొద్దీన్ ఆయన భార్య రేష్మా సుల్తాన మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. వారింట్లో శుక్రవారం దాడి చేయగా 1.45 కిలోగ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

‘బస్తా ఇస్తలేరు.. పట్టించుకుంటలేరు’


ఆందోళన చేస్తున్న అన్నదాతలు

కౌటాల(సిర్పూర్): తొమ్మిది రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరిగినా.. ఒక్క యూరియా బస్తా కూడా ఇస్తలేరని చింతలమానెపల్లి మండల రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కౌటాల రైతు వేదిక ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా బస్తాల కోసం వ్యవసాయ పనులు ఆపి కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎరువుల కోసం గంటల తరబడి పడిగాపులు గాయాల్సి వస్తుందని వాపోయారు. సరిపడా ఎరువులు పంపిణీ చేయకుంటే వ్యవసాయం చేయలా వద్దా అని ప్రశ్నించారు. యూరియా బస్తాల కోసం చింతలమానెపల్లికి వెళ్తే.. కౌటాల వెళ్లాలని చెబుతున్నారని, కౌటాలకు వెళ్తే అక్కడికే వెళ్లాలంటున్నారని తెలిపారు. చింతలమానెపల్లిలోనే అక్కడి రైతులకు ఎరువులు పంపిణీ చేయాలన్నారు. కాగా, యూరియా బస్తాలు అందజేస్తామని కౌటాల ఏవో ప్రేమలత తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు. కౌటాల, చింతలమానెపల్లి మండలాల రైతులు భారీగా తరలిరావడంతో పోలీసుల బందోబస్తు మధ్య యూరియా బస్తాలు పంపిణీ చేశారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

జైపూర్: ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మికసంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీపై జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడారు. కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచికార్యదర్శి బాజీసైదా, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: 13 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్ తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండలం దుర్గానగర్‌కు చెందిన మనోహర్ (55) 7వ తరగతి చదువుతున్న బాలికకు బిస్కెట్లు, చాక్లెట్లు కొనిస్తూ గత కొన్నిరోజులుగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తన కోరికలు తీర్చాలని కత్తితో బెదిరిస్తూ పలుమార్లు అఘాయిత్యం చేశా డు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో ఆమె మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

రైతుకు పరిహారం

కాసిపేట: మండలంలోని మద్దిమాడ అటవీ ప్రాంతంలో ఈనెల 2న ఆవుల మందపై చిరుత దాడి చేయగా లేగదూడ అక్కడికక్కడే మృతిచెందింది. మద్దిమాడ పంచాయతీ కార్యాలయంలో కొత్తగడ్‌పూర్‌కు చెందిన రైతు ఆడే సింగ్‌కు అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.6 వేల నష్టపరిహారం అందించారు. ఎఫ్ఎస్‌వో దేవాజీ, ఎఫ్‌బీవో రజిత, స్థానిక రైతులు ఉన్నారు.

కేసు కొట్టివేత

బోథ్: అక్రమంగా వలసవచ్చిన లంబాడాలను ఎస్టీ నుంచి తొలగించాలని గతంలో ఉద్యమం చేసిన వారిపై నమోదైన కేసును బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మౌనిక శుక్రవారం కొట్టివేశారు. తగిన సాక్ష్యాధారాలు లేక కొట్టివేసినట్లు పేర్కొన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడం గణేశ్, రాష్ట్ర నాయకులు నగేశ్, రామెల్లి భోజన్న, మెస్రం భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామికి ఊరట లభించింది.

గురిజాల రైతువేదికలో చోరీ

బెల్లంపల్లిరూరల్: మండలంలోని గురిజాల రైతు వేదికలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఏఈవో శ్రీనివాస్ శుక్రవారం అక్కడికి వెళ్లి చూడగా తలుపులు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్, సౌండ్ బాక్స్‌లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే అందించిన సమాచారంతో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, డీఏవో కల్పన, బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, ఏవో ప్రేమ్‌కుమార్‌లు ఘటనాస్థలానికి చేరుకున్నారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఏఈవో ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమారస్వామి

తాండూర్: ఈనెల 3న కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. తాండూర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లికి చెందిన ముడిమడుగుల తిరుపతికి దహెగాం మండలం భావన్‌నగర్ గ్రామానికి చెందిన తులసీతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి గ్రీష్మ (4) పాప ఉంది. పెళ్లయిన నాటి నుంచి భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇటీవల కాలంలో తిరుపతి తన భార్య తులసీపై మరింత అనుమానం పెంచుకున్నాడు. ఈనెల 2న ఈ విషయమై భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఎలాగైనా కట్టుకున్న భార్యను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 3న ఇంట్లో తులసీ నిద్రిస్తుంది. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన తిరుపతి ఆమె మెడపై గొడ్డలితో నరికి చంపాడు. భార్యను చంపానని బంధువులకు ఫోన్లలో తెలిపాడు. తులసీ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో కన్నెపల్లి ఎస్సై గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువకుడి మృతి?

- ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న గొల్లపెల్లి శ్రీనాథ్(25) శుక్రవారం ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతిచెందాడని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. శ్రీనాథ్‌కు శుక్రవారం ఉదయం కడుపు నొప్పి రావడంతో స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాం. సదరు ఆర్ఎంపీ ఒక ఇంజక్షన్‌తోపాటు మాత్రలు ఇచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్లగానే శ్రీనాథ్‌కు నోటి నుంచి నురుగులు రావటంతో వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి తమ కుమారుడు మృతిచెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతికి గల కారణాలు విచారించనున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడిజిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మద్యానికి బానిసై ఒకరు, మద్యంమత్తులో మరో యువకుడు, అనారోగ్యంతో మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..


దేవన్న మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన తోట దేవన్న (52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. దేవన్న కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా తిరుగుతుండేవాడు. గురువారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో ఈ విషయమై భార్య హేమలత, కుమారుడు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన దేవన్న అదేరాత్రి గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సతీశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

బజార్‌హత్నూర్: మద్యం మత్తులో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై లింబాజీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ముత్యంపేటకు చెందిన సుకుల్ నారాయణ–లక్ష్మి దంపతుల కుమారుడు సుకుల్ తరుణ్(23) ఓ ఫర్టిలైజర్ షాపులో పనిచేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. బహిర్భూమికని గురువారం మధ్యాహ్నం చెరువుకట్ట వైపు వెళ్లి తిరిగిరాలేదు. అక్కడ పురుగుల మందు తాగి కిందపడిపోయి ఉన్నాడని స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని అతన్ని పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో మహిళ..

లింగాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై గంగన్న కథనం ప్రకారం.. మండలంలోని జాముల్‌ధర గ్రామానికి చెందిన సలాం సరస్వతీ(33) గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు ఆమెను జైనూర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం..దండేపల్లి మండలం కొత్తకొమ్ముగూడెంకు చెందిన చుంచు వంశీకృష్ణ(24), కారుకూరి అంజి, దుమ్మని సందీప్ ఆటోలో మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి హాజరై ఇంటికి తిరుగు పయనమయ్యారు. దొనబండ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన వ్యాన్‌ను ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో అంజి, సందీప్ కు స్వల్పంగా, ఆటో నడుపుతున్న వంశీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తల్లి స్వరూప ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో నివాసం ఉంటున్న కాంపెల్లి శ్రీనివాస్(33) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ కూలీ పనిచేస్తూ మంచిర్యాల హమాలీవాడలో ఉంటున్నాడు. అంతుచిక్కని వ్యాధి బారిన పడ్డానని ఈనెల 2న పురుగుల మందు తాగాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు.మృతదేహం కోసం ఎవరూరాకపోవడంతో మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

మరొకరు కూడా..

తాంసి: మండలంలోని లీమ్‌గూడకు చెందిన టేకం బర్కత్(51) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. టేకం బర్కత్(51) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. గతనెల 30న సొంత పని నిమిత్తం ఆదిలా బాద్‌కు వచ్చాడు. జిలా కేంద్రంలోని తాంసి బస్టాండ్ ఏరియాలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి ఆటో వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.